ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 13 | ఏప్రిల్ | 2024
పేజీలు 7


## నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి




మెడికల్ కళాశాల డిజైన్‌ను పరిశీలించిన మంత్రి తుమ్మల

2 లో

- ఇసుక తరలింపు మాటున కోట్ల రూపాయల లూటీ
- పేరుకే గిరిజన సొసైటీలు పెత్తనమంతా గుత్తేదారులదే..



# గోదాట్లో.. ఇసుకాసురులు..!



పిరమైన ఇసుక గుత్తేదారులకు, వారికి సహకరించే వారికి కాసులు కురిపిస్తుంది. ఒక్క ఏడాది ఇసుక తరలింపు అవకాశం దక్కితే చాలు కోట్ల రూపాయల ఆస్తి వనగూరినట్లే. ఆరు శాఖల అధికారులు ఇసుక తోలకాలను , తరలింపును పర్యవేక్షించాల్సి ఉండగా ఏ శాఖ ఆ వైపు కన్నెత్తి చూడదు. తమకు రావాల్సినవి రాకపోతే ప్రభుత్వ వాహనాలు అలా ఓసారి క్వారీల వైపు వెళ్తాయి. ఇసుక తవ్వకాలు ఎక్కువ భాగం గిరిజన సొసైటీలకే అప్పగించినా వారికి ఇందులో ఒరిగేది ఏమి లేదు. పేరు గిరిజనులది ధనార్జనంతా గుత్తేదారులు, గిరిజనేతరులదే. దొంగలు పంటెత్తుకుపోతే రైతు పరిగ ఏరుకున్న సామెతే గిరిజనులది. చాలా మంది సొసైటీ సభ్యులకు సొసైటీల్లో ఏమి జరుగుతుందో తెలియదు. మహా నగరాలకు చెందిన గుత్తేదారులు స్థానికంగా వారి బినామీ దారులు గోదావరి ఇసుకపై పెత్తనం చెలాయిస్తుంటారు. కొందరు గిరిజనులను వెంటేసుకుని సొసైటీ సభ్యులు ప్రశ్నిస్తే బెదిరిస్తారు. గిరిజనేతరులు ప్రశ్నిస్తే ఎస్సి, ఎస్టి, అట్రాసిటీ కేసులంటూ భయపెడతారు. గోదావరి పరివాహక ప్రాంతమంతా ఇసుకాసురుల పెత్తనమే. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పెద్దిపల్లి క్వారీ గుత్తేదారులు వారి బినామీలు లూటీలో అగ్రభాగాన నిలిచారు. వారిని ప్రశ్నిస్తే చాలు ఇప్పుడు ప్రాణాలు తీసే పరిస్థితికి ఎగబాకారు. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం చేష్టలూడిగి చూస్తుండడం గమనార్హం.

-ప్రజాపక్షం/ఖమ్మం

2 లో

- చెల్లుబాటు కానీ నిబంధనలు..
- అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న అధికారులు
- కేటాయించింది ఓ చోట.. తోడేది మరో చోట

## ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ప్రధాన ఎజెండా



**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**
**-కూనంనేని సమక్షంలో సిపిఐలో భారీ చేరికలు**

ప్రజాపక్షం/కొత్తగూడెం : ప్రజా సమస్యలపై స్పందిస్తూ వాటి పరిష్కారకోసం అనునిత్యం శ్రమించడమే కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు, కమ్యూనిస్టు పార్టీ తరుపున గెలిచిన ప్రజాప్రతినిధుల ప్రధాన ఎజెండాగా ఉంటుందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సిపిఐ జిల్లా కార్యాలయం, శేషగరిభవన్‌లో శుక్రవారం జరిగిన కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి జనరల్‌బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిదిగా హాజరై మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, శ్రమైక జీవులకోసం ఆవిర్భవించింది సిపిఐ పార్టీ అని అన్నారు. ప్రజలను, ప్రజలకోసం పనిచేసే కమ్యూనిస్టు కార్యకర్తలను ఎల్లవేలాలా కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఉద్యమాల ద్వారా మొద్దు నిద్రపోతున్న పాలకులను తట్టిలేపుతామన్నారు. రాబోయే పార్లమెంట్లు ఎన్నికల్లో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన భాద్యత కమ్యూనిస్టులపై ఉందని, తెలంగాణలోనూ, కార్పోరేట్‌కు

మిగతా 2లో..

## జాడలేని జనరిక్ ఔషధాలు..!



**- ఆదరణకు నోచుకోని జనరిక్ మందులు**
**- శాసిస్తున్న ఫార్మా కంపెనీలు**
**- అవగాహన కల్పించడంలో విఫలం**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : శంఖంలో పోస్తేనే గానీ తీర్థం కానట్లు పెద్దపెద్ద మందుల షాపుల్లో కొంటేనే తప్ప రోగాలు తగ్గవనే చందంగా తయారైంది ప్రస్తుత పరిస్థితి. ప్రజలను చుట్టుముట్టే రోగాల భారి నుండి విముక్తి కలిగించేందుకు అతి తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే జనరిక్ మందులను రాష్ట జీవనధార, కేంద్రప్రభుతవ జన ఔషద పేరిట అందుబాటులోకి తెచ్చినప్పటికీ బహుళజాతీ ఫార్మ కాంపుల మార్కెట్ మాయాజాలంలో ఆధరణకు నోచుకోవడం లేదు. ప్రస్తుతం వైద్యుల ఫీజు కంటే మందుల ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఒక పేషంట్ సాధారణ వ్యాధితో ఆస్పత్రికి వెళ్లాడంటే చాలు కనీసం రూ.1000 నుండి రూ.2000 వేల మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. అదే పెద్దపెద్ద జబ్బుల వారైతే కనీసం రూ.5 వేల

మిగతా 2లో..

# గోదాట్లో ఇసుకాసురులు..!







**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రభుత్వ నిబంధనలు ఇతరత్రా కారణాలతో ఇసుక పిరమైంది. భవన నిర్మాణదారులకు ఇసుక కొనుగోలు తలకు మించిన భారంగా మారింది. అదే ఇసుక గుత్తేదారులకు కోట్ల రూపాయలు సమకూర్చిపెడుతుంది. ఎప్పుడైతే ఇసుక తరలింపు, తవ్వకాలు లాభాలను తీసుకు వస్తున్నాయో అక్రమార్కులు ఆ వైపు కన్నేశారు. గోదావరి పరివాహాక ప్రాంతంలో ప్రభుత్వం గిరిజన సొసైటీల ద్వారా ఇసుక తరలింపుకు అవకాశం కల్పించింది. ఇదే కొందరికి వరంగా మారింది. గిరిజన సొసైటీలలో సభ్యులుగా ఉండే వారిని నామ మాత్రం చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సాండ్ క్వారీ కమిటీలు, టిఎస్ఎండిసి జనరల్ మేనేజర్‌తో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం ఏ ప్రభుత్వ నిబంధనను పాటించడం లేదు. పర్యావరణ చట్టం 2002 కానీ, కన్సర్వేన్సీ చట్టం 1984 కానీ ఇప్పుడు గోదావరి ఇసుక తరలింపులో పాటించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన చోట రెండు మీటర్ల వరకు మాత్రమే ఇసుకను తోడాల్సి ఉంది. అక్కడ కూలీలతో ఇసుకను ట్రాక్టర్లలో నింపి డంపింగ్ యార్డు వద్దకు తరలించాల్సి ఉంది. కానీ కేటాయించిన చోట కాకుండా వేరే ప్రాంతాలలో ఇసుకను తోడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెండు మీటర్లు కాకుండా అంత కంటే ఎక్కువ లోతు నుంచి ఇసుకను తోడుతున్నారు. గోదావరిలోకి యంత్రాలను దింపి అక్కడి నుంచి ఇసుకను తరలిస్తున్నారు తప్ప ఎక్కడ కూలీలతో ఇసుకను ట్రాక్టర్లలో నింపి డంపింగ్ వద్దకు తరలించిన దాఖలాలు లేవు. ఆన్‌లైన్‌లో ఇసుక తరలింపు ప్రారంభమైన తర్వాత అదనంగా ఇసుక లోడు చేయడం ద్వారా కాంట్రాక్టర్లు ఒక్కో లారీకి రూ. 2వేల నుంచి లారీ సామర్థ్యాన్ని బట్టి ఐదు వేల రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. అదనంగా ఇసుక తరలించడం ద్వారా ప్రభుత్వం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఇసుక లారీలకు అదనంగా ఇసుకను లోడ్ చేస్తే (ఓవర్ లోడ్) పెద్ద మొత్తంలో జరిమానా విధించాల్సి ఉంటుంది. జరిమానాల సంగతి సరే అసలు ఇసుక లారీలను తనిఖీ చేసే వారే లేకుండాపోయారు. టిఎస్ఎండిసి అధికారులు ఎక్కడ ఉన్నారో ఎవరికి అర్థం కారు. గోదావరి పరివాహాక ప్రాంతం డంపింగ్ యార్డు నుంచి ఓవర్ లోడ్‌తో లారీ బయలుదేరగానే అధికార యంత్రాంగానికి సమాచారం వస్తుంది అంతే వారెవ్వరు రోడ్డుపై కనిపించారు. కానీ గుత్తేదారులకు సహకరించని లారీలు వస్తే వెంటనే అధికారులు చుట్టుముట్టి పోలీస్ స్టేషన్లకు తరలిస్తుంటారు. ఇసుకను నిబంధనలకు లోబడి కాకుండా లోతు నుంచి తవ్వితే జరిమానా విధించాల్సి ఉంటుంది. కానీ లోయలను తలపించే రీతిలో గోదాట్లో ఇసుక తోడుతున్న ఏ ఒక్కశాఖ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. గోదావరిలో ఇంత తతంగం జరుగుతున్న అటు ఉన్నతాధికారులు కానీ, ఇటు జిల్లా అధికార యంత్రాంగం కానీ ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. గిరిజన సొసైటీ సభ్యులకు ఇసుక తరలింపు ద్వారా ఉపాధి కల్పించాలనే లక్ష్యం దారితప్పి నగరాలలో నివసించే గుత్తేదారులకు, స్థానికంగా ఉండే వారి బినామీలకు పెద్ద మొత్తంలో ఉపాధి దొరుకుతుంది. సొసైటీ సభ్యులు ఏదైనా ప్రశ్నిస్తే అమాయక గిరిజనులను వేధింపులకు గురి చేస్తున్నారు. మీరేం చేస్తున్నారు అంతా చేసేది మేమే ఇలా ప్రశ్నిస్తే గోదాట్లోకి దిగరంటూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. గిరిజనుల పక్షాన సామాజిక కార్యకర్తలు కానీ, రాజకీయ పార్టీల కార్యకర్తలు కానీ ప్రశ్నిస్తే కేసుల పేరుతో భయపెడుతున్నారు. గోదావరి పరివాహాక ప్రాంతం మొత్తం ఇసుక మాఫియా తయారైంది. ఆన్‌లైన్ అనుమతులు లేకుండానే గోదావరి ఇసుక హైదరాబాద్ సహా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా తరలిపోతుంది. ఇసుక లారీలు బయలుదేరినప్పటి నుంచి గమ్యస్థానాలకు చేరే వరకు వాహనాల్లో లారీ వెంట వస్తూ ఆపే అధికారులకు, పోలీసులకు ఫోన్‌లు చేయిస్తూ చెల్లింపులు చేస్తూ ఇసుకను తరలిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పెద్దిపల్లి సొసైటీ అక్రమాలకు అంతే లేకుండాపోతుంది. గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక అధికారులు వారి అడుగులకు మడుగులొత్తుతున్నారు. గత ప్రభుత్వం ఇసుకాసురులకు స్వేచ్ఛనిచ్చింది. ఈ ప్రభుత్వమైనా ఇసుక అక్రమ రవాణాను నియంత్రిస్తుందని సొసైటీ నిబంధనలు అమలు చేయడం ద్వారా గిరిజనులకు లబ్ది జరుగుతుందని ఆశించారు. ఇప్పుడు పరిస్థితి గతమే నయమన్న చందంగా తయారవుతుందన్న ఆవేదన వ్యక్తమవుతుంది. ప్రభుత్వం గోదావరి ఇసుక అక్రమ తరలింపుకు సంబంధించి గుత్తేదారుల పై వారికి సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుని పారదర్శకంగా ఇసుక తరలింపు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మెడికల్ కళాశాల నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణానికి సంబంధించి కాంట్రాక్టర్, బిల్డింగ్ డిజైన్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం భేటీ అయ్యారు. మెడికల్ కళాశాల డిజైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డిజైన్ బాగుందని తరగతి గదులు, హాస్టల్ బిల్డింగులు, ప్రొఫెసర్స్ క్వార్టర్స్, స్టాఫ్ క్వార్టర్స్, క్రీడా మైదాన నిర్మాణం తదితర వాటికి సంబంధించి కేటాయించిన స్థలంలో ఏ బిల్డింగ్ ఎక్కడ నిర్మిస్తే బాగుంటుందన్న విషయంపై కళాశాల సూపరింటెండెంట్, అధ్యాపక బృందంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. మైనింగ్ అధికారులతో మాట్లాడి మెడికల్ కళాశాలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని గతంలో ఎవరైతే మట్టి కోసం గుంతలు తవ్వారో వారితో గుంతలు పూడిపించి స్థలాన్ని చదును చేసి ఇచ్చేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం మోడల్‌గా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

## జాడలేని జనరిక్ ఔషధాలు..!

(మొదటిపేజీ తరువాయి)
పై మాటే. పేద, సామాన్య, మధ్య తరగతి వారి ఆర్థిక భారాన్ని కొంతైనా తగ్గించేందుకు జనరిక్ మందులు దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపింది. కానీ ఇవి నేటికి కూడా ఆధరణకు నోచుకోలేదు.

**అవగాహన కల్పించక...**

జనరిక్ మందులుపై అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. వాస్తవానికి జనరిక్ మందులు షాపులను జిల్లా కేంద్రాలతో పాటు, డివిజన్, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సి ఉండగా, నేటికి కూడా పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతానికి భద్రాచలం, ఎంపి బంజర్, కొత్తకూడెం, పాల్వంచ,అశ్వరావుపేటలలో మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రోజుల్లో ప్రతీ ఒక్కరూ నిత్యం ఏదో ఒక మందుగోలి మింగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ రోజు కోట్లాది రూపాయల ఔషదాల అమ్మకాలు సాగుతున్నాయి. అవే మందులు జనరిక్‌లో కూడా లభ్యమవుతున్నాయి. ఇక్కడ కొనుగోలు చేయడం ద్వారా ప్రజలు సుమారు 15 నుండి 20 శాతం ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది. జబ్బు తగ్గించే విషయంలో జనరక్ మందులు కూడా ఇతర మందులతో సమానమైన పనితనం కలిగి ఉన్నప్పటికీ వాటిని ప్రచారం చేయడంలో పూర్తిగా విఫలం చెందుతున్నారు. జిల్లా ఉన్న ఐదు జనరిక్ షాపులు రోజుకు రూ.3000 నుండి రూ.4 వేల లోపే అమ్మకాలు సాగిస్తుండగా, ఆస్పత్రుల అనుసందానంగా ఉండే మెడికల షాపులు రోజుకు రూ.50 వేలు ఆ పై బడి, ఇతర మందుల దుకాణాలు రోజుకు సమారు రూ. 4 వేల నుండి రూ.5 వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రతీ జనరిస్ మందుల దుకాణానికి 200 రకాల మందులను సరఫరా చేయాల్సి ఉండగా, కేవలం 100 రకాల లోపు మందులను మాత్రమే సరఫరా చేస్తున్నారు.

**ప్రతి నిత్యం రూ.10 కోట్ల వ్యాపారం...**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1500 నుండి 2 వేల మెడికల్ షాపులు ఉన్నాయి. వీటి అనుసంధానంగా ప్రతీ నిత్యం రూ.10 కోట్లకు పై బడే వ్యాపారం సాగుతున్నట్లు తెలుస్తోంది. మరో ప్రక్క పెద్దపెద్ద ఔషద కంపెనీలు స్వయంగా జిల్లా, మండల కేంద్రాల్లో మెడికల్ షాపులను తెరిచి కొనుగోళ్లపై 10 నుండి 20 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నారు. బడా ఫార్మా కంపెనీలు వారి వ్యాపార సామ్రాజ్యాన్ని ఇప్పటికే విస్తరించడంతో పాటు మార్కెట్లోకి పలు రకాల ఆఫర్లతో వస్తున్నాయి. దీంతో పాటు తమ మందులను వాడటం ద్వారా జబ్బులు త్వరగా తగ్గిపోతాయని ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. దీంతో జనరిక్ మందులు ఆదరణకో నోచుకోక, అమ్మకం, వాడకం డీలా పడిపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవతీసుకుని జనరిక్ మందులపై ప్రజలకు అవగాహన కల్పించి ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున జనరిక్ ఔషదాల దుకాణాలు తెరిచి పేద,సామాన్య, మధ్య తరగతి ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ప్రధాన ఎజెండా



(మొదటిపేజీ తరువాయి)
ఊడిగంచేస్తూ, ప్రజలమధ్య కుల, ప్రాతీయ చిచ్చుపెడుతున్న బిజెపిని దేశం పొలిమేరలవరకు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఐ నియోజకవర్గ సమావేశం సందర్భంగా కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు, ఫోర్ ఇంక్లైన్ జిపి తాజా మాజీ సర్పంచి, పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూనంనేని సమక్షంలో సిపిఐలో చేరారు. వీరికి కూనంనేని సిపిఐ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించి ప్రాథమిక సభ్యత్వాన్ని అందజేశారు. పార్టీలో చేరిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు సేవలందించాలని, ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయడంతోపాటు అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజాపోరాటాల నిర్మించాలని తద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సిపిఐలో చేరిన వారిలో కౌన్సిలర్లు మాచర్ల రాజకుమారి, బోయిన విజయ్‌కుమార్, పి.సత్యనారాయణచారి, నేరెల్ల సమైక్య, మాజీ సర్పంచ్ కాశీవిశ్వనాద్, పలుపార్టీల నాయకులు, కార్యకర్తలు మాచర్ల శ్రీనివాస్, పిడుగు శ్రీనివాస్, బొతు బాబూరావు, బొక్క శ్రీనివాస్, కర్రె వాసు, రామంచి శ్రీనివాస్, కుమారస్వామి, కుమార్, మద్దిపాక సుధాకర్, భూక్య లాలు, ఎండి.సుబాని తదితరులు ఉన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, రేసు ఎల్లయ్య, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, కంచర్ల జమలయ్య, వి.మల్లికార్జున్‌రావు, జి.వీరస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, జక్కుల రాములు, నాయకులు ఎస్.వెంకటేశ్వర్‌రావు, నూనావత్ గోవిందు, జర్పుల ఉపేందర్, ధనలక్ష్మి, కిరణ్, మూడు గణేష్, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ కార్యకర్త పగడాల భరత్ మృతి

-పలువురి నివాళి
-సంతాప సానుభూతి తెలిపిన పలువురు నేతలు







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్త, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఏకైక కుమారుడు పగడాల భరత్‌కుమార్ (23) శుక్రవారం మృతి చెందారు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న భరత్ ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. భరత్ మరణంతో ఖమ్మం కార్పోరేషన్ 14వ డివిజన్ కొత్తగూడెంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తండ్రి కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పనిచేస్తుండడంతో భరత్ అందరితో కలివిడిగా తిరుగుతూ ఉండేవాడు. పార్టీ కార్యక్రమాలు జరిగితే ముందు వరుసలో నిలిచే భరత్ మరణం గ్రామంలో ప్రతి ఒక్కరి కండ్లు చేమర్చేలా చేసింది. మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు గాదె లక్ష్మినారాయణ, ఏనుగు గాంధీ, నానబాల రామకృష్ణ, సిపిఐ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, శాఖమూరి శ్రీనివాసరావు, నాయకులు ప్రతానపు రామనాథం, చింతకాయల వెంకటేశ్వర్లు, రావుల హన్మంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు రావూరి సైదబాబు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిఏ సిహెచ్ రవికిరణ్, పగడాల నాగరాజు తదితరులు భరత్ భౌతికాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఫోన్‌లో పగడాల మల్లేష్‌ను పరామర్శించారు. భరత్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు.

**పలువురి సంతాపం :**

పగడాల భరత్ మృతి పట్ల పలువురు సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సిపిఐ నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్ సంతాప సానుభూతిని తెలియజేశారు. మల్లేష్‌తో చరవాణిలో మాట్లాడి ఓదార్చారు.

# గడువు లోగా బియ్యాన్ని ఎఫ్‌సిఐకి తరలించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** నిర్దేశిత గడువు లోగా రైతుల నుంచి సేకరించిన ఖరీఫ్ ధాన్యం నిల్వలను మరాడించి బియ్యాన్ని భారత ఆహార సంస్థ ఎఫ్‌సిఐకి తరలించాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ మిల్లర్లను ఆదేశించారు. అదనపు కలెక్టర్ ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం గ్రామం సత్యనారాయణ సిల్కీ రైస్ మిల్, కూసుమంచి మండలం దక్షిణామూర్తి రైస్ మిల్లు, నేలకొండపల్లి మండలం సహస్ర ట్రేడర్స్, ముదిగొండ మండలం శ్రీ సత్యసాయి రైస్ మిల్ లను అదనపు కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మిల్లు యజమానులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ధాన్యాన్ని మరాడించి బియ్యంను భారత ఆహార సంస్థకు చేరేవిధంగా మిల్లర్లు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించని మిల్లర్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. మిల్లుల యాజమాన్యం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలని ఆయన తెలిపారు.

# కల్లూరులో రబీ వరి కోతలు ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని రఘునాథ గూడెం, జీడిబిపల్లి, పుల్లయ్య బంజర, లక్ష్మీపురం, కప్పల బంధం, బత్తులపల్లి, కొర్లగూడెం, పాయపూరు, పెద్ద కోరుకొండి, చంద్రుపట్ల తదితర గ్రామాలలో వ్యవసాయ బోర్లు ఆయకట్టు పరిధిలో 2400 ఎకరాలలో 5000 మంది రైతులు వరి పంట సాగు చేశారు. బోర్లు ఆయకట్టు పరిధిలో వేసిన పంట వాతావరణం అనుకూలించనందున దిగుబడి అంతగా లేనందున ఎకరాకు 25 వేలు పెట్టుబడి తో పంటను సాగు చేయగా కేవలం 20 నుంచి 25 బస్తాలు మాత్రమే సాగు వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం దిగుబడి దిగాలుగా ఉంది. రైతులు దిగాలు పడ్డారు. యాసంగి దిగుబడి దిగులుబడిగా మిగిలింది. వర్షాభావ పరిస్థితుల వలన ఆయకట్టు లో వరి పంట సాగు చేయలేదు. వ్యవసాయ బోర్లు పరిధిలో మాత్రమే ఈ సంవత్సరం అష్ట కష్టాలతో రైతులు సాగు చేశారు.

# ఓటింగ్ సరళిని పెంచేందుకు ఇంటింటీ సర్వే

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు పట్టణంలోని ప్రధానమైన నాలుగు పోలింగ్ కేంద్రాలలో 4000 మంది ఓటర్ల ఇండ్లకు వెళ్లి సర్వే ను శుక్రవారం నుంచి తహశీల్దార్ పులి సాంబశివుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. వారం రోజులు పాటు నాలుగు బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వేను ముమ్మరం చేశారు. గతంలో అసెంబ్లీ ఎన్నికలలో 80 శాతం లోపు మాత్రమే పోలింగ్ సర్వే నమోదు కావడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మరియు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకొని తమ ఓటును ఇష్టమైన వారికి వేసుకోవాలని చైతన్యవంతులని చేస్తున్నారు. ఓటు వజ్రాయుధం లాంటిదని ఓటు పౌరుని హక్కు అని తప్పనిసరిగా ఓటును వినియోగించుకొని తమకు ఇష్టమైన మెచ్చిన వారికి ఓటు వేసుకోవాలని కోరుతున్నారు.



ఈ కార్యక్రమాలలో రెవిన్యూ సిబ్బంది, రికార్డ్ అసిస్టెంట్లు బిల్లు కలెక్టర్లు పాల్గొంటున్నారు.

## జానిమియా మృతికి మంత్రి తుమ్మల సంతాపం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మంచుకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు షేక్ జాని మియా ఇటీవల మృతిచెందారు. ఆయన మృతిపట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం మంచుకొండలోని జాని మియా స్వగృహంకు వెళ్లి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. జానిమియా మృతి పట్ల సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రేగళ్ల సీతారాములు ప్రమాదంలో గాయపడి కాలు కోల్పోయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అతనిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారి స్వగృహంకు వెళ్లి పరామర్శించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, కార్పొరేటర్లు మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, గుత్తా వెంకటేశ్వర్లు, మండల నాయకులు వాంకుడోత్ దీపక్ నాయక్, మాజీ సర్పంచ్ విజయ, రాము నాయక్, భద్రు నాయక్, లింగా నాయక్, సత్యనారాయణ, రాందాస్, శ్రీను, కోటయ్య, గంధసిరి వీరభద్రం, ఎస్‌కె నాగులమీరా, బోధన్, రంజాన్, సర్దార్, ఫిరోజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల పరామర్శ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు కొమ్మినేని లక్షణరావు రైతు మరణించారు ఆయన భౌతికకాయాన్ని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు వేర్వేరుగా సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు ఫోటో సత్యం దిరిశాల నరసారావు, బైర్ల కాంతారావు, ఉబ్బన బాబురావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వరరావు, సండ్ర వెంట కాటమనేని వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## సిపిఐ సీనియర్ కార్యకర్త మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్‌రోడ్‌లోని అవేర్‌కాలనీకి చెందిన సిపిఐ పార్టీ సీనియర్ కార్యకర్త లంజపల్లి వీరస్వామి(70) అనారోగ్యంతో గురువారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ పార్టీ స్థానిక నాయకులు పాల్వాయి యోబు,నారపొంగు యాకుబ్, ప్రసాద్, జేమ్స్, భాస్కర్, మల్లేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్ధిని గెలిపించండి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ కూలీలను, గ్రామ ప్రజలను కలుసుకుని త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్ధిని భారీ మెజారిటీ గెలిపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రవేశపెట్టనున్న పథకాలను వివరించారు. అనంతరం గ్రామ సమస్యలు కూడా తెలుసుకుని పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో ఖమ్మం జిల్లా అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుందని, ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కాపా సుధాకర్, రాయల రాము, రఘుపతిరెడ్డి, బొడ్డు వెంకటేశ్వర్లు, నాగిరెడ్డి, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాయంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/కరకగూడెం: ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కరకగూడెం మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మణుగూరు మండల ప్రజా భవన్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కరకగూడెం మండలంలోని పులుసు బొంత ప్రాజెక్టు సంబంధించి మరొకసారి సర్వే నిర్వహించి రైతు లెవరు నష్టపోకుండా న్యాయం చేయాలని మండల రైతులతో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మండల నాయకులు గొగ్గలి రవి, రామకృష్ణ, కార్యకర్తలు, యువకులు, గ్రామస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్సూరెన్స్ చెక్కుల అందజేత



ప్రజాపక్షం/చండ్రుగొండ: పిఏసిఎస్ గానుగపాడు సొసైటీ ఛైర్మన్ చెవుల చెందర్‌రావు చేతుల మీదుగా శుక్రవారం సొసైటీలో అప్పు తీసుకొని చనిపోయిన 7 గురు రైతుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ చెక్కులను అందించారు. ఈసందర్భంగా సొసైటీ ఛైర్మన్ చందర్‌రావు మాట్లాడుతూ సొసైటీలో అప్పు తీసుకొని మరణించిన రైతు కుటుంబాలను ఇన్సూరెన్స్ నగదు రూ 50వేలను అందించడం జరిగిందన్నారు. 7గురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ 50వేలను అందించనట్లు తెలిపారు. అందించిన వారిలో కుక్కల సుజాత, ఎస్‌కే ఫాతిమూన్, అజ్మీరా రామి, కందికొండ అప్పమ్మ, మూడు నందా , కుక్కల మల్లేశ్వరి, కునుసోత్ లిఖితలను అందించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ లంకా నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్టు నరికివేత



ప్రజాపక్షం/కల్లూరు: ఎండిపోయిన చెట్టుతో పొంచి ఉన్న ప్రమాదంపై స్పందించిన ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి గ్రామంలో పాఠశాల వెంబడి ఉన్న ఎండిపోయిన చెట్టు ప్రమాదకరంగా మారడంతో ప్రజాపక్షం దినపత్రిక అధికారుల దృష్టికి తెలియ పరచడంతో స్పందించి చెట్టును కొట్టివేశారు. దీంతో ప్రమాదాన్ని తప్పించారు. అధికారులు స్పందించి ఎండిపోయిన చెట్టును తీసివేయడంతో అధికారులకు గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలిపారు

## ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని మూడవ డివిజన్ జయనగర్ కాలనీలో కాంగ్రెస్ నాయకులు మారం కరుణాకర్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని నాయకులతో సరదాగా గడిపారు. అనంతరం కరుణాకర్ రెడ్డి స్వగృహంలో ఆత్మీయ విందును స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు మారం కరుణాకర్ రెడ్డి దంపతులు శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, కార్పొరేటర్లు మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి బోరు ఏర్పాటు



ప్రజాపక్షం/ మధిర : మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామంలో ప్రస్తుత వేసవికాలంలో మంచినీటి కోసం కష్టాలు పడుతున్న ప్రజల సమస్యను పరిష్కరించేందుకు డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల్లో భాగంగా డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సుమారు రూ.1లక్షతో మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ ఉండటంతో ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా రూ.1లక్ష అప్పుగా ఏటి ఒడ్డున రెండు బోరు పాయింట్లను వేయించారు. గ్రామ ప్రజల మంచి నీటి ఎద్దడి నివారణకు రెండు బోర్లు వేయించిన దొండపాటికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## రఘునాథపాలెంలో పర్యటించిన మంత్రి తుమ్మల





ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రఘునాథపాలెం మండలంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. మంగ్యాతండా లో ఇటీవల ప్రతిష్ఠించిన హనుమాన్ ఆలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంగిడి గ్రామంలో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. ఈర్లపుడి గ్రామంలో నూతన వధూవరులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశీర్వదించారు. అదేవిధంగా పాపటపల్లి గ్రామంలో పలు వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షులు మహ్మద్ జావిద్, కార్పొరేటర్లు మలీదు జగన్, మలీదు వెంకటేశ్వర్లు, గుత్తా వెంకటేశ్వర్లు, ఎంపిపి భూక్యా గౌరి, మాజీ సర్పంచ్ దేవ్ సింగ్, తారాదేవి, కొంటెముక్కుల నాగేశ్వరరావు, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.

## రైతు లేకపోతే దేశాభివృద్ధి లేదు..

### రైతుసంఘం రాష్ట్ర కమిటి సభ్యులు నున్నా



ప్రజాపక్షం/కొణిజర్ల : రైతులు ఎంతో కష్టపడి దేశానికి కావాల్సిన ఆహారధాన్యాలు , ఎన్నో రకాల పంటలు పండించి దేశానికి వెన్నెముకగా నిలుస్తున్నాడని రైతులేకపోతే దేశాభివృద్ధి లేదని రైతుసంఘం రాష్ట్ర కమిటి సభ్యులు నున్నా నాగేశ్వరరావు అన్నారు. అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిదిలోని తనికెళ్లలో రైతుసంఘం జెండాను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రైతులు నకిలీ విత్తనాలు , నకిలి మందుల తోనష్టపోయి సరైన పంట పండక తీవ్రంగా నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని వీటిని అరికట్టాలంటే నకిలి పురుగుమందులు , నకిలి విత్తనాలు తయారుచేసే కంపెనీలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని అన్నారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు చేయూతనిచ్చి బ్యాంకుద్వారా ఉచితంగా రుణాలు ఇప్పించి వారిని ఆదుకోవాలని పేర్కొన్నారు. రైతులకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన నల్లచట్టాలను రద్దు చేస్తామని ప్రకటించిన కేంద్రప్రభుత్వం రద్దుచేయలేదని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పోరేట్ వ్యవసాయ అనుకూల విధా నాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతులకు ఏఇబ్బంది వచ్చినా రైతు సంఘం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు భూక్యా వీరభద్రం , వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ , రైతుసంఘం జిల్లా నాయకులు చెరుకుమల్లి కుటుంబరావు , చల్లా నారాయణ , రజకసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు , యాసా వెంకయ్య, యాసా ప్రభాకర్‌రావు , యాసా వెంకటేశ్వర్లు , పాపిట్ల ప్రసాద్ , యాసా తిలక్ , డివైఎఫ్ఐ నాయకులు వేముల సాంబశివరావు , కె గిరిబాబు , స్థానిక రైతులు పాల్గొన్నారు.

## 'సీతారామ'ను వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేయాలి

### తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు



ప్రజాపక్షం/వైరా: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వలు నుంచి వైరా రిజర్వాయర్ అనుసంధానం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం వైరాలో బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో తెలంగాణ రైతు సంఘం పట్టణ అధ్యక్షులు మల్లెంపాటి రామారావు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం విస్తృత సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ వైరా రిజర్వాయర్ అనుసంధానం లింక్ కెనాల్‌కు రాష్ట్ర మంత్రులు మార్చి13న వైరా రిజర్వాయర్ వద్ద శంకుస్థాపన చేశారని, ఇప్పుడు కాకుండా జూలురుపాడు మండలం వినోబానగర్ నుంచి ఏన్కూరు మండలం హిమాంనగర్ పై నుంచి ఏన్కూరు రేపల్లెవాడ మధ్య నుంచి నాగార్జునసాగర్ ఎడమ కాల్వ గోపాల్‌పేట వద్ద లింక్ చేసి బ్యాంకు వాటర్ వైరా రిజర్వాయర్‌కు మరలించే ప్రతిపాదన అధికారులు చెబుతున్నారని అలాకాకుండా పాపకొల్లు రెవెన్యూ గుట్టల దగ్గర నుంచి ఏన్కూరు మండలం రాజలింగాల సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ లింక్ చేయడం ద్వారా వైరా రిజర్వాయర్‌కు నేరుగా సీతారామ ప్రాజెక్ట్ నీరు విడుదల చేసే అవకాశం ఉందని, శంకుస్థాపన రోజు వైరా రిజర్వాయర్ అనుసంధానం సర్వేకి ఆదేశించారని రాజలింగాల సమీపంలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ లింక్ చేయడం ద్వారా కొణిజర్ల మండలం ఏన్కూరు మండలంలో కూడా సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశాలు ఉంటాయని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వలు వైరా రిజర్వాయర్ శాశ్వతంగా ఉపయోగపడే విధంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, మాజీ ఎంపిపి బొంతు సమత, సిఐటియు జిల్లా నాయకులు సుంకర సుధాకర్, రైతు సంఘం నాయకులు హరి వెంకటేశ్వరరావు, బెజవాడ వీరభద్రం, సంక్రాంతి నర్సయ్య, పైడిపల్లి సాంబశివరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, తోట కృష్ణవేణి, చిత్తారు నాగరాజు, కామినేని రవి, దేశభక్తిని నర్సింహారావు, మచ్చా కృష్ణమూర్తి, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ, మల్లెంపాటి ప్రసాద్, పాసంగులపాటి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిని వాడవాడలా నిర్వహించాలి



ప్రజాపక్షం/ మధిర : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను పల్లెల్లో, పట్టణాల్లో, ప్రతి వాడలో నిర్వహించాలని బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మధిరలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక అసమానతలకు అంటరానితనానికి కారణమైన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన గొప్ప మానవతావాది, నవభారత రాజ్యాంగం ద్వారా దేశ ప్రజల హక్కులు అభివృద్ధికై కృషి చేసిన గొప్ప దేశభక్తుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని అన్నారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని, భారతరాజ్యాంగం ప్రజాస్వామ్య విలువలను, సిద్ధాంతాలకు కట్టుబడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో పాలన సాగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లింగాల కమల్‌రాజు విజ్ఞప్తి చేశారు.

# గొంతెండుతోంది...!

### -చెరువులు ఖాళీ.. అడుగంటిన బావులు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వేసవి తీవ్రత వెంటాడుతుంది....తాగటానికి ప్రజలే కాదు...మూగజీవాలు కూడ అల్లాడుతున్నాయి. కొంత మంది స్వార్ధ పరుల లాభాపేక్ష వలన పలు గ్రామాలు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. చేపల వేట కోసం చెరువులో ఉన్న నీటిని వదిలి వేయటంతో చెరువు పూర్తిగా ఎండిపోయింది. ఫలితంగా చెరువుమాధారం, మంగాపురం, చిన్నతండా, రాయగూడెం, బైరవునిపల్లి తదితర గ్రామాలలో ప్రజలు తాగునీటికి అల్లాడుతున్నారు. గత 50 ఏళ్ల క్రితం నుంచి ఏనాడు కూడ ఎండని చెరువు కేవలం చేపల కాంట్రాక్టర్ స్వార్థం కోసం చెరువు లో ఉన్న కాస్త నీరు కూడ వదిలేశారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు సంబంధిత అధికారులుకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణలు వినవస్తున్నాయి. దాదాపు 350 ఎకరాల విస్తీరణం కలిగిన చెరువు నేడు ఏడారిని తలపిస్తుంది. చెరువులో నీరు లేకపోవటంతో గ్రామాలలో భూగర్భజలాలు అడుగంటి బావులు, బోరులలో నీరు సరిపడ రాక అవస్తలు పడుతున్నారు. ప్రజలే కాదు...మూగజీవాల బాధ చెప్పలేనిది...ఏటు చూసిన చుక్కనీరు కనిపించకపోవటంతో గొంతెండుతున్న చెప్పుకోలేని బాధ వర్ణాతీతం...మొత్తం మీద మండలంలోని నేలకొండపల్లి, రాజేశ్వరపురం, నాచేపల్లి తదితర చెరువులు అడుగంటి పోయాయి. ప్రజలకు తాగునీటి కొరత వెంటాడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యామ్నయం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి



ప్రజాపక్షం/ మధిర : మధిర ప్రభుత్వ ప్రధాన హాస్పటల్‌లో పనిచేస్తున్న పేషంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుద్ధ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 8 నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో నిరవధిర సమ్మె చేస్తామని ఎఐటీయూసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం మధిర మెడికల్ ఆఫీసర్ కార్మికులతో కలిసి సమ్మె నోటీస్‌ను అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్యవిధాన పరిషత్ అనుసంధానంగాఉన్న నేలకొండపల్లి, తిరుమలయపాలెం, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి తదితర ప్రభుత్వ హాస్పటల్లో పనిచేసే పేషెంట్ కేర్, సెక్యూరిటీ, పారిశుద్ధ కార్మికులకు ఎఐటీయూసి చేసిన పోరాటం ఫలితంగానే జీతాలు అందాయన్నారు. జిల్లా అధికారుల నిర్లక్ష్యం వలన మధిరలో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు అందటం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న 8నెలల జీతాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఎఐటీయూసి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షులు చెరుకూరి వెంకటేశ్వరారావు, జిల్లా నాయకులు యంగల ఆనందరావు, వర్కర్లు రాజు, మదన్, శాంతి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### - బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి



ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో విఫలమైందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక బిజెపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను వంచించిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కులేదని అన్నారు. రైతులకు ఇంతరకు రెండు లక్షల వ్యవసాయ రుణమాఫీ చేయకుండా దగా చేసిందని, అలాగే ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అదించలేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు రూ.25వేలు నష్టపరిహారం, రుణమాఫీ, రైతు బంధు అందించాలని డిమాండ్ చేశారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్‌లో ఎన్నికల్లో ప్రజలను, రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని, కేంద్రంలో మూడోసారి మోడి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, బిజెపి జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, పట్టణ అధ్యక్షులు పాపట్ల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, కాసినా నాగభూషణం, బియ్యవరపు రామకృష్ణ, పగడాల నాగేంద్రబాబు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


## ఇక్కడ చట్టం.. బినామీల చుట్టం..!

### పెద్దిపల్లి ర్యాంపులో జీరో దందా

ప్రజాపక్షం/ చర్ల : పెద్దిపల్లి ఇసుక ర్యాంపులో బినామీలు అసలు సొసైటీ సభ్యులను కీలు బొమ్మలుగా చేసి పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక ర్యాంపులో బినామీ కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్ల సొసైటీకి భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్న ఆందోళన సొసైటీ సభ్యుల్లో వ్యక్తమవుతుంది. సాండ్ క్వారీ కమిటీ టిఎస్ ఎండిసితో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉండగా గుత్తేదారులు వారి బినామీలు ప్రభుత్వ చట్టాలను పక్కనపెట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. టిఎస్ ఎండిసి ఆన్‌లైన్‌లో పెద్దిపల్లి ఇసుక క్వారీని పెట్టినప్పటి నుంచి గుత్తేదారులు రెండు రకాల మోసాలకు పాల్పడుతున్నారు. ఒకటి జీరో దందాపై ఇసుకను తరలించడం, రెండవది ఆన్‌లైన్ ద్వారా వచ్చిన ఇసుక లారీలకు అదనంగా ఇసుకను లోడ్ చేసి రెండు వేల నుంచి లారీ సామర్థ్యాన్ని బట్టి ఐదు వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇసుక తవ్వకాలు, తరలింపును పర్యవేక్షించాల్సిన అధికారులు ఆ వైపు వెళ్లడం లేదు. కాంట్రాక్టర్లు చెప్పిందే టిఎస్ ఎండిసి, రెవెన్యూ, ఇతర అధికారులకు వేదంగా మారింది. ఇసుక తవ్వకాలకు సంబంధించి ఎంత ఇసుకను తవ్వుతున్నారు, ఎంత ఇసుకను తరలిస్తున్నారు అనే దానికి సంబంధించి రికార్డుల నిర్వహణ లేదు. ఇసుక తవ్వకాల్లో కూడా కనీస నిబంధనలను పాటించడం లేదు. అక్రమ తవ్వకాల పై ఏ ఒక్క అధికారి పెద్దిపల్లి ర్యాంపు వైపు చూసిన దాఖలాలు లేవు. ఇక్కడి నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ఇసుక తరలిపోతున్నా ఏ లారీనైనా నిలువరించి జరిమానా విధించిన ఘటనలు లేవంటే అధికార యంత్రాంగం ఇక్కడి గుత్తేదారులకు ఏ స్థాయిలో సహకరిస్తుందో అవగతమవుతుంది. జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి తక్షణం పెద్దిపల్లి ఇసుక ర్యాంపు అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గిరిజనులకు అన్యాయం చేస్తున్న గుత్తేదారులు వారి బినామీల పై కూడా చర్యలు తీసుకోవాలని సొసైటీ సభ్యులు కోరుతున్నారు.

## శివాలయంలో నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవం





ప్రజాపక్షం/గుండాల : మండల కేంద్రం లోని పడుగోని గూడెం గ్రామంలో శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ జీవధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమాన్ని ఆలయనిర్మాణ దాత గాడెపల్లి లోకేశ్వరావు, కీ:శే ,లక్ష్మి విజయకుమారి , గాడెపల్లి గంగాధర్,రోహిణి, చి: వివస్వాన్ క్రిష్ణ, చి: శ్రీవత్సవ్‌లోకేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం వేదపండితులైన కేతముక్కుల పవన్‌కుమార్ శర్మ, తీర్ధం రామక్రిష్ణశర్మ, సనత్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో త్రయాహ్నిక దీక్షతో పూజకార్యక్రమం నిర్వహించి నాభిశిలా ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత మూడు రోజుల పాటు వేద పండితుల యజ్ఞశాలలో ఆవాహిత దేవతా పూజలు, గణపతిపూజ, పుణ్యాహవచనము, గర్తన్యాస,ధాతున్యాస భీజన్యాసములు, యంత్ర ప్రతిష్ఠాపన, నాభిశిలాప్రతిష్ఠాపణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాభిశిలా ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మండల కేంద్రంనుండి, చుట్టు ఉన్న గ్రామాల ప్రజలు తండోప తండాలుగా విచ్చేసి శివనామస్మరణతో ఆలయం మారుమోగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఊకె నాగయ్య, , దొర ఊకె బాబురావు, పటేల్ పెండెకట్ల నరెందర్, మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో భద్రతా చర్యలు




ప్రజాపక్షం/గుండాల : మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ రవిందర్ తెలిపారు. ప్రజలు తమ ఓటు హక్కును ఎటువంటి భయభ్రాంతులకు గురి కాకుం డా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర మరియు స్థానిక పోలీస్ బలగాలతో కట్టు దిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయడం జరుగుతుందని తెలిపారు. ఓటు అనేది రాజ్యాంగ కల్పించిన హక్కుఅని , సరైన వ్యక్తిని ఎన్నుకోవడానికి ఓటు ఎంతో ఉపయోగపడుతుందని , అసెంబ్లి ఎన్నికలలో మాదిరి రాబోవు పార్లమెంటు ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగే విదంగా ప్రతి ఒక్కరు క్రుషి చేయాలని కోరారు.

## వాసవి క్లబ్ ఆద్వర్యంలో కంటి వైద్యశిబిరం.

ప్రజాపక్షం/గుండాల : ఈ నెల 15న మండల కేంద్రంలో వాసవి క్లబ్ గ్రీన్ ఫీల్డ్ ఆద్వర్యంలో ఎల్వి ప్రసాద్ నేత్రవిజ్ఞాన సంస్థ సహకారంతో మండల కేంద్రంలో ఉచితమెగా కంటి వైద్యశిభిరం నిర్వహించడం జరుగుతుందని వాసవిక్లబ్ అద్యక్షులు మానాల వెంకటేశ్వర్లు , ప్రదాన కార్యదర్శి పుల్లఖండం ఉపెందర్, కోశాదికారి అనుముల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కంటిచూపు సమస్యతో బాదపడుతున్నవారికి కంటిచూపును అందించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని , కంటి చూపు సమస్యతో బాదపడుతున్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి





ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని వ్యవసాయ బావిలో అనుమానస్పద స్తితి లో మృతదేహం ఉంది. నేలకొండపల్లి మండలం లోని నాచేపల్లి గ్రామానికి చెందిన చట్టు నాగరాజు (32) అనే యువకుడు శుక్రవారం బావిలో శవమై తేలాడు. మృతుడు ఆయన స్నేహితుడు కలిసి బుధవారం మద్యం సేవించటానికి గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావి వద్ధ కు వెళ్లారు. కానీ నాగరాజు ఇంటికి వెళ్లకపోవటంతో కుటుంబ సభ్యులు బంధువులు,స్నేహితుల ను వాకాబు చేశారు. కానీ ఆచూకీ లభించలేదు. కాగా శుక్రవారం అదే బావి వద్ధ శవమై కనిపించాడు. అప్పటి నుంచి మృతుడు తో కలిసి తిరిగే స్నేహితుడు మాత్రం అనుమానం తిరుగుతున్నాడు. స్తానికుల సమాచారం మేరకు సదరు యువకుడు ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రమాదవశాత్తు జరిగిందా ఇంకా ఏమైనా ఉందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాపక్షం/భద్రాచలం : నిర్వహణ పనుల్లో భాగంగా నేడు విద్యుత్ సరఫరా కొద్ది గంటలపాటు నిలుపుదల చేస్తున్నట్లు ఆశాఖాధికారులు తెలిపారు. ఉ.9 గం నుండి మధ్యాహ్నం 1 గం. వరకు భద్రాచలం, కొర్రాజుల గుట్ట సబ్ స్టేషన్లలో మరమ్మత్తులు చేస్తున్నామని,దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని సూచించారు.

# సత్ఫలితాలు ఇస్తున్న ఆపరేషన్ చేయూత

**- దళ సభ్యుల కుటుంబాలకు పోలీసుల కౌన్సిలింగ్**
**- లొంగిపోయిన నలుగురు దళ సభ్యులు**






**ప్రజాపక్షం/చర్ల :** మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు చేపడుతున్న ఆపరేషన్ చేయూత సత్ఫలితాలను ఇస్తోంది. ఇందులో భాగంగా పోలీస్ అధికారులు మావోయిస్టు దళ సభ్యులను కుటుంబాల వద్దకు వెళ్లి అవాగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిలాల్ పోలీసులు, 141,81 సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ల సమక్ష్యంలో నలుగురు మావోయిస్టు దళ సభ్యులు శుక్రవారం లొంగిపోయారు. వివరాల ప్రకారం, చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేదిక మావోయిస్టు పార్టీ కుటుంబ సభ్యులతో ఎస్‌పి రోహిత్ రాజ్ సమావేశం అయ్యారు. ఈ మేరరకు వారితో ముఖాముఖి నిర్వహించారు. ఏజెన్సీలో నివశిస్తున్న అమాయక అదివాసీలను మావోయిస్టులు బలవంతంగా దళంలో చేర్చుకుని, తమ ఉనికి కోసం, స్వార్థ ప్రయోజనాల కోసం వారిచే చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను అడ్డుకుని అభివృద్ధి నిరోదకులుగా మారుతున్నారని అన్నారు. తెలిసీ తెలియని తనంతో మావోయిస్టు పార్టీలోకి వెళ్లి అనేక మంది చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారంతా మావోయిస్టు దళ సభ్యులు నలుగురు శుక్రవారం లొంగిపోయారు. చర్ల మండలం బూరుగుపాడుకు చెందిన దేవా, కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన కాంపెల్లి రాజ్ కుమార్, ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలోని తిమ్మాపురంకు చెందిన సోడే గంగా, సుకుమా జిల్లా డోకుపాడుకు చెందిన కల్మ దేవ్‌లు లొంగిపోయిన వారిలో ఉన్నారు. మావోయిస్టు సిద్ధాంతాలు, అగ్రనాయకుల వేదింపులు తాళలేక మావోయిస్టు పార్టీని వీడుతున్నట్లు లొంగిపోయిన వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ఆపరేషన్స్ టి. సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పి పారితోష్ పంకజ్, సిఆర్‌పిఎఫ్ కమాండెంట్‌లు సునీల్ కుమార్, రాజ్ కుమార్, సిఐ అశోక్, ఎస్సై శ్రీనివాస్, రమేష్, అశోక్ రెడ్డి, ముత్యం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెన్సింగ్ పేరుతో పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దుపూడి గ్రామ సమీపంలో రోడ్ల ప్రక్కన ఉన్న పచ్చని చెట్లను ఫెన్సింగ్ పేరుతో నరికేశారు. దుద్దిపూడి వెళులుతంటే రోడ్ల ఇరుప్రక్కల ఉన్న పచ్చని చెట్లు చల్లని నీడని ఇస్తున్నాయి. అలాంటి చెట్లను పొలానికి వేసి ఫెన్సింగ్‌కి అడ్డొస్తున్నాయి అనే పేరుతో రోడ్లపై ఉన్న చెట్లను కూడా నరికి వేయడం పట్ల దిద్దిపూడి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క చెట్లని పెంచాలి నీడనిస్తాయి. ప్రకృతికి పర్యావరణానికి ఎంతోఉపయోగపడతాయని పదేపదే చెబుతూ ఉంటే దానికి విరుద్ధంగా రోడ్లపై ఉన్న చెట్లను నరకడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఫెన్సింగ్ వేసుకోవడానికి చెట్లుమి అడ్డొచ్చాయని రోడ్లపై ఉన్న చెట్లను ఎందుకు నరకాల్సిన అవసరం వస్తుందని ఎంతోమందికి మండుతున్న ఎండల్లో చల్లని నీడనిచ్చే చెట్లను నరకడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికిన వారిపై కఠినచర్యలు తీఉకొని మరల ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యటన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో శనివారం పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు తిరుమలాయపాలెం మండలం హైదర్‌సాయిపేటలో జరిగే శ్రీశ్రీశ్రీ లింగా బసవేశ్వర స్వామి విగ్రహా ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కూసుమంచిలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొత్తగూడెం విద్యా నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# సీత్లా నాయక్‌కు డాక్టరేట్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంకు చెందిన ప్రముఖ కవి, గాయకుడు హలావత్ సీత్లా నాయక్ కు ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ వారు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈనెల ఆరున హైదరాబాద్‌లోని హియాయత్ నగర్‌లో ఉన్న శ్రీ శారద కల్చరల్ లైవ్ స్టూడియోలో జరిగిన కార్యక్రమంలో సముద్రాల వేణుగోపాలచారి చేతుల మీదుగా సీత్లా నాయక్‌కు డాక్టరేట్‌ను ప్రధానం చేశారు. డాక్టరేట్‌తో పాటు కవిత, గాన, చిత్ర, పర్యావరణ రంగాలలో సీత్లా నాయక్ చేసిన విశేష కృషిని గుర్తించి ఉగాది పండుగ సందర్బంగా ఇందిర ఆర్ట్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షురాలు పివిపి అంజనీకుమారి, అధ్యక్షురాలు డా॥ ఎన్. ఇందిర, ప్రధాన కార్యదర్శి డా॥ ఆలూరి విల్సన్ తదితరులు ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కళా నిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ దర్శకుడు కె. విశ్వనాథ్ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో జరిగిన కార్యక్రమంలో సీత్లా నాయక్‌కు హైకోర్టు న్యాయమూర్తులు సుధారాణి, రానిశ్, రాధారాణి చేతుల మీదుగా స్వర్ణ నంది పురస్కారాన్ని అందజేశారు. డాక్టరేట్‌తో పాటు పలు పురస్కారాలు అందుకున్న సీత్లా నాయక్ ను పలు సాహితి సంస్థలు, కవులు, రచయితలు, గాయకులు అభినందించారు.

# నూతన గృహప్రవేశంలో పాల్గొన్న కూనంనేని



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురంలో జరిగిన దామ వారి నూతన గృహ ప్రవేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. గ్రామంలో దామా సత్యం ఇంటికొచ్చిన ఎమ్మెల్యే కూనంనేనికి పలువురు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పూర్వ జ్ఞాపకాలను గుర్తుచేసుకొని వారితో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దొండపాటి రమేష్, యర్రా బాబు, దామా వీరయ్య, లలితచౌదరి తదితరులు పాల్గొన్నారు.

# ధన్యజీవి మన్నేపల్లి అప్పారావు




**ప్రజాపక్షం/ తల్లాడ :** సీనియర్ సిపిఎం నాయకులు మన్నేపల్లి అప్పారావు సమ సమాజ కోసం తన చిన్ననాటి నుండి నమ్మి న సిద్దాంతం కోసం ఎత్తిన జెండా దించ కుండా చివరి శ్వాస వరకు ఉన్నారని, తన పార్థీవ దేహంపై ఎర్రజెండాను కప్పుకుని ధన్యజీవి అయ్యారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం కేశవపురంలో అప్పారావు ప్రథమ వర్ధంతి సభ మన్నేపల్లి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అనేక మంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం వివిధ రాజకీయ పార్టీలు మారుతున్న తరుణంలో నీతినిజాయితీ నిబద్దత గల ఎర్ర జెండా కోసం, సిపిఎం పార్టీ అభివృద్ధి కోసం పని చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే అప్పారావుకి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, సేలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్‌రావు, షేక్. నన్నేసాహెబ్, మన్నేపల్లి రామారావు, అర్జున్‌రావు, నారికొండ రవి, రాజారావు పాల్గొన్నారు.

# భద్రాచలంలో బిఆర్‌ఎస్‌కు షాక్

**- వంద కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరిక**

**ప్రజాపక్షం/భద్రాచలం :** బిఆర్‌ఎస్‌కు భద్రాచలంలో షాక్ తగిలింది. .ఇప్పటి వరకు బిఆర్‌ఎస్ పార్టీలో నాయకులుగా చెలామని అయున వారితో పాటు పలువురు కార్యకర్తలకు చెందిన సుమారు 100 కుటుంబాల వారు ఆ పార్టీ శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు కేకే ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో కొండిశెట్టి కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ సందర్భంగా సమావేశం జరుగుతున్న ప్రాంతానికి ఎంఎల్‌ఏ డా. తెల్లం వెంకట్రావును పిలిపించుకున్న నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కాగా ప్రస్తుతం పార్టీ మారుతున్న వారంతా గతంలో వివిధ పార్టీల నుండి బిఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారే. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత కాలం అధికారాన్ని అనుభవించి, ఇప్పుడు పార్టీ ఓటమి పాలుకావడంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరితున్నారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రజలకు సేవ చేసేందుకే తామంతా బిఆర్‌ఎస్ పార్టీని వీడి అధికార పార్టీలో చేరినట్లు చెబుతున్నారు.

# అక్రమ మట్టి తోలకాలకు పాల్పడితే కఠిన చర్యలు

**-అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** మట్టి అక్రమ తోలకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఖమ్మం రూరల్ ఎస్ఐ పి. రామారావు హెచ్చరించారు. శుక్రవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న మట్టి ట్రాక్టర్లను ఆయన సీజ్ చేశారు. మద్దులపల్లి, కాచిరాజుగూడెం ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లతో పాటు రెండు జేసిబిలు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్బంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీజ్ చేసిన వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగించారు.



జ్యోతిరావు పూలే జయంతి సందర్బంగా
నివాళులర్పిస్తున్న బిసి హక్కుల సాధన సమితి నాయకులు

# పల్లెల చూపు.. జూన్ వైపు...!

## గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి







**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** లోక్‌సభ ఎన్నికల అనంతరం జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి భువనగిరి లో ప్రకటించటంతో పల్లెల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఖమ్మం జిల్లా లో 589 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి జూన్ లో స్తానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్న ప్రకటన తో ఆశావహాలలో సందడి నెలకొంది. ఫ్రిబవరి 1 తేదిన సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. అంతకు ముందే నూతన ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని భావించారు. ఆ వెంటనే ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ను గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఎన్నికలు మరి కొంత కాలం తరువాత నిర్వహించే అవకాశం ఏర్పడింది. తాజాగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రెండు నెలలో స్తానిక సంస్తల ఎన్నికలను నిర్వహిస్తామని గ్రామాలలో రాజకీయం ఊపందుకుంది. ఖమ్మం జిల్లాలో 16,23,814 ఓటర్ల ఉన్నారు. ఖమ్మం నియోజకవర్గం లో 3,22,259 ఓట్లు, పాలేరు లో 2,39,653, మధిర లో 2,21,567, వైరా నియోజకవర్గం లో...1,92,670 ఓట్లు, సత్తుపల్లి నియోజకవర్గంలో 2,42,767 ఓట్లు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని 589 గ్రామపంచాయతీలలో పోలింగ్ నిర్వహించనున్నారు.

**జూలై లో ముగియనున్న ఎంపీపీ, జడ్పీటీసీ ల పదవీ....**

సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ఎన్నికలను మూడు దశలలో నిర్వహించారు. మొదట సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసింది. ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలు జూలై 3 తో వీరి పదవీ కాలం ముగియనున్నది. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో ఈ సారి స్తానిక ఎన్నికలు సవాల్ గా తీసుకొనున్నారు. గత ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో ఎక్కువ స్తానిక సంస్తల పదవులు బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున్న వీరి ప్రతిష్ట ను పెంచుతారా లేదా అనేది సవాల్ గా మారింది.

**కులగణన చేపడితే ఆలస్యం....**

గత ఎన్నికల హామీలో భాగంగా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపడుతామని తెలిపింది.ఈ మేరకు ఇటీవల ఈ ప్రక్రియ కనీసం రెండు నెలల సమయం పడుతుంది. అయితే కులగణన చేపట్టిన తరువాతనే స్తానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని బీసీ సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు మరింత ఆలస్యమైయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రానున్న స్థానిక సమరంలో రిజర్వేషన్లు ప్రక్రియ ఎలా ఉంటుందనే విషయం పై నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు.

### -జూలైలో ముగియనున్న ఎంపీపీ, జడ్పీటీసీల పదవీకాలం
### -కుల గణన చేపడితే మరింత ఆలస్యం

**ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటుంది: కె.సుధాకర్, ఎంపీటీసీ, బోదులబండ.**



స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న స్థానాలు కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకునేందుకు కాంగ్రెస్ కు అవకాశం ఉంది. ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారంటీలు గ్రామాలలో సందడి తెచ్చాయి. అందుకే స్తానిక సమరంలో విజయం కోసం కార్యచరణ రూపొందించాం.

**తాజా మాజీ సర్పంచ్‌ల బిల్లుల సంగతి తెల్చాలి : పసుమర్తి శ్రీనివాస్, ఆఫ్, రాష్ట్ర నాయకులు, నేలకొండపల్లి.**



గత పాలకుల మీద కోపం తో కాంగ్రెస్ ప్రభుత్వం తాజామాజీ సర్పంచ్‌లను ఇబ్బంది పెట్టటం సరి కాదు. వారికి చెల్లించాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లించి ఎన్నికల షెడ్యూల్ ను ప్రకటించాలి. అప్పుల పాలై ఉపాధి కూలీలు గా, సుతారీ పనులకు వెళ్తున్నారు.ప్రభుత్వం వారి బకాయిలు చెల్లించకుంటే ప్రభుత్వం కు శాపం గా మారుతుంది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం ప్రకటించాలి.

**కుల గణన పూర్తి చేయాలి : గండు సతీష్, తాజా మాజీ సర్పంచ్, అమ్మగూడెం.**



కుల గణన వెంటనే చేపట్టి సకాలంలో పూర్తి చేయాలి. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల స్తానాలల బీసీలకు రావాల్సిన వాటా ప్రకారం వచ్చేలా కులగణన జరగాల్సిందే. ఆ తరువాతే ఎన్నికలు నిర్వహించాలి. హడావుడిగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదు. పూర్తి స్తాయిలో సర్వే అనంతరం బీసీ రిజర్వేషన్లు ప్రకటించాలి. అప్పుడే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలి.

## జార్జ్ రెడ్డి ఆలోచనలతో విద్యార్థులు ముందుకెళ్లాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థి హక్కులకై పోట్లాడిన జార్జ్‌రెడ్డిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్ తెలిపారు. శుక్రవారం జార్జ్‌రెడ్డి 52వ వర్ధంతి సదస్సును ఖమ్మంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆజాద్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై ఆకతాయిలు చేస్తున్న మూకదాడులపై తిరుగుబాటు చేపిన ధీరయోధుడు కామ్రేడ్ జార్జ్ రెడ్డి అన్నారు. జార్జ్‌రెడ్డి ఏ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడారో వారే నేడు పాలకులుగా మారి దేశాన్ని విధ్వంసం చేశారన్నారు. మరో దఫా అధికారంలోకి రావడానికి చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో శాస్త్రీయ భావాజాలాన్ని విద్యార్థుల మెదళ్లలో జపించేటటువంటి దుర్మార్గపు ఆలోచనను అడ్డుకోవాలన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించడమే జార్జ్‌రెడ్డికి అర్పించే నిజమైన



నివాళి అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు దీపిక, నాయకులు శ్రీను, రమేష్, వైష్ణవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మృతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** వైరా మండలం పాలడుగు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న గంగసాని శ్రీనివాసరావు (58) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. ఏ పాఠశాలలో పనిచేసినా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఆయన పేరు తెచ్చుకున్నాడు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీనివాసరావు మృతిపట్ల వివిధ రంగాల ప్రముఖులు తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీనివాసరావు అంత్యక్రియలు శనివారం ఉదయం బోనకల్ మండలం బ్రాహ్మణపల్లిలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.



## మద్యం మత్తులో వీరంగం

### -పోలీస్ వాహనంపై దాడి
### -భయభ్రాంతులకు గురైన స్థానికులు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. వాసిరెడ్డి కళ్యాణ మండపం ఎదురుగా ఎన్నెస్పి కెనాల్ రోడ్డు నెం తొమ్మిదిలో బహిరంగంగా బీరు తాగుతూ స్థానిక మహిళలను తిడుతూ భయభ్రాంతులకు గురి చేశాడు. బీరు బాటిల్‌ను నెత్తిన పెట్టుకుని హల్ చల్ చేశాడు. భయాందోళనకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం




ఇవ్వగా పోలీసులు అక్కడకు చేరుకోగా ఆ వ్యక్తి పోలీస్ వాహనంపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశాడు. పోలీస్ పర్యవేక్షణ లోపం కారణంగా ఇటీవల మందుబాబులు చెలరేగిపోతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ, గంజాయి తాగుతూ హల్ చల్ చేస్తున్నారు. పోలీస్ అధికారులు దీనిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

## రాజకీయ వివక్షతతో రాష్ట్రంలో పాలన

### పెనుబల్లి లో బిఆర్ఎస్ సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/ పెనుబల్లి :** రాష్ట్రంలో రాజకీయ వివక్షతతో కూడిన పాలన సాగుతుందని బిఆర్ఎస్ నేతలు ఆరోపించారు. శుక్రవారం ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక సప్తపది ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటులో తెలంగాణ వాణిని వినిపించేది బిఆర్ఎస్ మాత్రమే అన్నారు. మంచి విలువలు, సంప్రదాయాలతో బిఆర్ఎస్ తెలంగాణలో రాజకీయాలు చేసిందని కానీ అందుకు విరుద్ధంగా పాలన సాగుతుందన్నారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందని ఆయన తెలి



పారు. బిఆర్ఎస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని నామ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.